అంగన్వాడీల ఆగ్రహం

- 36 గంటల మహాధర్నాకు అనూహ్య స్పందన
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అంగన్‌వాడీలు
- మండుటెండను సైతం లెక్క చేయక ధర్నా
- నినాదాలతో హోరెత్తిన కలెక్టరేట్

అంగన్‌వాడీల్లో ఆగ్రహం పెల్లుబికింది. తమ సమస్యల పరిష్కారంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై గూడు కట్టుకున్న కోపం కట్టలు తెంచుకుంది. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంపు, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లింపు, గ్రాట్యుటీ తదితర డిమాండ్లతో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద మహాధర్నా, వంటా వార్పు నిరసన కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, హెల్పర్లు భారీగా తరలివచ్చారు. ఎండ వేడిమి, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా, ధర్నా శిబిరంలో కూర్చొని నిరసన తెలిపారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రతినబూనారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేయకుండా మోసం చేశారని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ విమర్శించారు. అంగన్‌వాడీలకు గౌరవ వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం, సిఎఫ్‌ఎంఎస్‌లో ఉద్యోగులుగా పొందుపరిచి వారిని సంక్షేమ పథకాలకు దూరం చేయడం అన్యాయమన్నారు. అంగన్‌వాడీలు ఉద్యోగలుగా ప్రభుత్వం భావిస్తే, వారికి రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పద్ధతి ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు కేటాయించాల్సిన బడ్జెట్‌లో ఏటా కోత పెడుతోందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వంటా వార్పు చేస్తున్న యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు

మాట నిలబెట్టుకుంటారా? గద్దె దిగుతారా?

తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారని, అంగన్వాడీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటురా? గద్దె దిగుతారా? అన్నది తేల్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. గ్రాట్యుటీపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్వాడీలు నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

మోడీ ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో 26 లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందిగా ఉన్న స్కీమ్‌వర్కర్లను మోడీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. సంవత్సరం పైగా సెంటర్ అద్దెలు చెల్లించడానికి నిధుల్లేవన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు చాలీచాలని వేతనాలు చెల్లించడంతో పెరుగుతున్న గ్యాస్ ధర, నిత్యావసరాల ధరలతో బతకలేకపోతున్నారని చెప్పారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అందులో పనిచేస్తున్న వారికి మెయిన్ కేంద్రాల వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఫుడ్ కమిషనర్ అంగన్వాడీ సెంటర్లు సందర్శన పేరుతో వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉత్తేజపరిచిన ప్రజా కళాకారుల గీతాలు

ధర్నా శిబిరంలో ప్రజా కళాకారులు పలు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కళాకారులు హేమసూదన్, బాలాజీ, రాంబాబు, త్రినాథరావు, రామచంద్రరావు, శ్రీనివాసరావు పాటలు పాడి అంగన్‌వాడీలను ఉత్తేజ పరిచారు.

పలు సంఘాల మద్దతు

అంగన్‌వాడీల ఆందోళనకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరీష్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో-కన్వీనర్ అల్లు మహాలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శిర్ల ప్రసాద్, కళాసీ సంఘం జిల్లా కార్యదర్శి కె.సూరయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, ఎన్.వి రమణ, అల్లు సత్యనారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి, భవిరి కృష్ణమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కె.కళ్యాణి, నాయకులు పి.లతాదేవి, బి.ఆదిలక్ష్మి, కె.సుజాత, జయలక్ష్మి, హైమావతి, హేమలత, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని ఎదిరించి

పతకాలు చేతపట్టి...

- పారా బ్యాడ్మింటన్ లీగ్‌లో విజయకేతనం
- మూడు వెండి పతకాలు సాధించిన రూపాదేవి

రెండు కాళ్లు పనిచేయవు, అడుగు వేసే పరిస్థితి లేదు. అయితేనేం అంతర్జాతీయ పారా బాడ్మింటన్ పోటీల్లో విజయకేతనం ఎగురవేసింది. మూడు సిల్వర్ పతకాలను ఒడిసిపట్టింది. ఏం ఆడతావు, ఎలా ఆడగలవని నిరుత్సాహపరిచినా, అవరోధాలు ఎదురైనా అన్నింటికీ దాటుకుని అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. ఆమె ఎవరో కాదు మన సిక్కోలు ముద్దుబిడ్డ సంతవురిటికి చెందిన పడాల రూపాదేవి. 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి' అన్న ఎ.పి.జె అబ్దుల్ కలాం చెప్పిన మాటలను అక్షరాలా నిజం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

ప్రజాశక్తి - జి.సిగడాం

జి.సిగడాం మండలం సంతవురిటికి చెందిన పడాల యశోద, సత్యనారాయణ దంపతుల రెండో కుమార్తె రూపాదేవి. చిన్నప్పుడే ఆమె తన తండ్రిని కోల్పోయింది. అప్పట్నుంచీ తల్లి యశోద తన రెక్కల కష్టంతో సంతానాన్ని పెంచి పెద్ద చేసింది. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. 2019లో డిగ్రీ చదువుతుండగా డాబా నుంచి పడిపోయి రెండు కాళ్లు పోగొట్టుకుంది. ఆ దశలో ఎవరైనా నిరాశలో కూరుకుపోతారు. రూపాదేవిలో మాత్రం ఆత్మవిశ్వాసం సన్నగిల్లలేదు. అందరికంటే

ఉగాండాలో సిల్వర్ మెడల్స్‌తో జాతీయ జెండాను ఎగురవేస్తున్న రూపాదేవి

భిన్నంగా వ్యవహరించింది. రెండు కాళ్ల లేకపోయినా అంతులేని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటూ పారా బ్యాడ్మింటన్ పోటీలు ఆడడం ప్రారంభించింది. ఈ ఏడాది మార్చి 23, 26వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన 5వ జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్‌లో బంగారు పతకాన్ని గెలుచుకొని, ఉగాండాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. 2021 డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. దీంతో కొందరు దాతలు ఆమె శిక్షణకు సహకారం చేశారు. మైసూర్‌లో శిక్షణ తీసుకుని 2022 ఆగస్టులో బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో బంగారం పతాకాన్ని సాధించింది. ఉగాండాలో నిర్వహించిన సింగిల్స్ డబుల్, మిక్స్‌డ్ డబుల్స్‌లో జాతీయస్థాయిలో వెండి పతకాన్ని కైవసం చేసుకుని జాతీయ జెండాను ఉగాండాలో ఎగురవేసింది. జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై నిలిపిన రూపాదేవికి బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, కో చైర్మన్ తర్లాడ అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులు ఎ.వేణుగోపాలరావు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ధవళ రాజేంద్రకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

- గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మోహనరావు
- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - పలాస

గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని, గిరిజన భూములకు రక్షణ లేకుండా పోయిందని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మోహనరావు, ఎస్.ఫల్గుణరావు అన్నారు. మందస మండలం కొండలోగాం గిరిజన భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండలోగాంలో 105 గిరిజన కుటుంబాలు తరతరాలుగా 75 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. సాగులో ఉన్న గిరిజనుల పేర్లను అడంగల్‌లో నమోదు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూముల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.గణపతి, నాగేష్, సోమయ్య, కృష్ణారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదు

- జీడి మద్దతు ధరపై స్పందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - సోంపేట

జీడి మద్దతు ధరపై జిల్లాకు చెందిన మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎందుకు మాట్లాడడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రశ్నించారు. మండలంలోని మామిడిపల్లిలో గల సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక మంత్రి అప్పలరాజు మద్దతు ధరపై స్పందించాలని డిమాండ్ చేశారు. జీడి రైతులు మద్దతు ధర లేక తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి జీడి మద్దతు ధరపై మాత్రం మౌనం వహిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ రైతుభరోసా కేంద్రాల జరుగుతాయని ప్రకటనలు గుప్పిస్తున్నాయని, జీడిపిక్కలను ఎందుకు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడి యాజమాన్యాలు పరిశ్రమల బంద్ పేరుతో అటు రైతాంగాన్ని, ఇటు కార్మికులను తీవ్రంగా దోపిడీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జీడిపప్పుకి ఏటా ధర పెరుగుతుంటే, జీడిపిక్కకు మాత్రం తగ్గుతోందని చెప్పారు. దీనివల్ల అటు రైతాంగం, ఇటు వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి జీడి రైతుల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించి, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని, జీడి పరిశోధనా కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలన్నారు. జీడి పంట విస్తరణ, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందన్న ఆయన, మద్దతు ధర కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని జీడి రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు పాతిన కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, తెప్పల పాపారావు, గొరకల మన్మథరావు, కర్రి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జీడి సంక్షోభానికి ప్రభుత్వమే కారణం

టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాకేష్

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో జీడి వ్యాపారులు, కార్మికులు, రైతులు రోడ్డున పడ్డారని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డి.రాకేష్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జీడి రైతులు, కార్మికులతో సమావేశం నిర్వహించిన అనంతరం జీడి పరిశ్రమలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి రైతులను నట్టేట ముంచిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 80 కిలోల జీడిపిక్కల బస్తా రూ.14 వేలకు రైతుల నుంచి కొనుగోలు చేశారని, ప్రస్తుతం రూ.ఎనిమిది వేలకూ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. జీడి మద్దతు ధర కోసం మంత్రి అప్పలరాజుకు రైతులు విన్నవించినా కనీసం స్పందించడం లేదని విమర్శించారు. జీడిపప్పు మార్కెట్ లేక, రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీడి వ్యాపారులు, రైతుల సమస్యలపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించారని, అధికారంలోకి వస్తే ఆదుకుంటామని భరోసానిచ్చారని చెప్పారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ జీడి వ్యాపారులు, రైతుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంకాల రవిశంకర్ గుప్త, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, సవర రాంబాబు, పట్టణ కార్యదర్శి నవీన్, అంబటి కృష్ణమూర్తి, జోగ మల్లి, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలను పరిశీలిస్తున్న రాకేష్

22న ప్రత్యేక లోక్ అదాలత్

శ్రీకాకుళం : ఈనెల 22వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. నగరంలోని జిల్లా కోర్టులో గల జిల్లా జడ్జి ఛాంబరులో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్, మోటారు ప్రమాద కేసుల పిటిషనర్ న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ ప్రమాద కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసుల కోసం నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ కావడం వల్ల కక్షిదారులకు ధనం, సమయం వృథా కావని, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు, కె.జీవరత్నం, న్యాయవాదులు ఎల్.గోవిందరాజులు, ఎన్ని సూర్యారావు, యునైటెడ్ ఇండియా ఓరియంటల్, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు, ఎపిఎస్ ఆర్‌టిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్య ఉత్పాదకతను పెంచడమే లక్ష్యం

నౌపడ : మత్స్య ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మత్స్య సంపద యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు తెలిపారు. సంతబొమ్మాళి మండలం నౌపడ సచివాలయంలో జాతీయ మత్స్య కృషీవలుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆక్వా రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై ప్రధాన లక్ష్యం మత్స్య, ఆక్వా రంగాలను అభివృద్ధి చేయడమేనని చెప్పారు. వాటి ఉత్పత్తిని పెంచడం, భూమి నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడమేనన్నారు. హీరాళాల్ చౌదరి అనే శాస్త్రవేత్త జన్మదిన సందర్భంగా ఏటా జూలై 10న మత్స్యకార రైతులు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రైతులకు అందజేస్తున్న సబ్సిడీ వస్తువులు, వాహనాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ మూసలినాయుడు, జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కె.జగన్నాథం, తహశీల్దార్ చలమయ్య, ఎంపిడిఒ ప్రేమలీల, సర్పంచ్ బృందాదేవి, రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్‌కు రాలేదని 'ఆసరా' ఆపేశారు

- ఎచ్చెర్ల ఎంపిపిపై ఫిర్యాదు
- 'స్పందన'కు 232 వినతులు



సమస్యను వివరిస్తున్న కాష్యూ లేబర్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి గత నెలలో నిర్వహించిన ఆయన వ్యక్తిగత సమావేశానికి హాజరు కాలేదన్న కక్షతో మూడో విడత ఆసరా పథకం సొమ్ము తమ ఖాతాలో పడకుండా నిలుపుదల చేయించారని ఎచ్చెర్ల ఉప సర్పంచ్ జరుగుళ్ల శంకర్ ఆధ్వర్యాన ఎచ్చెర్లకు చెందిన విఒ అధ్యక్షులు, స్వయంశక్తి సంఘాల సభ్యులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి ఎంపిపిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 232 వినతులు వచ్చాయి. ఎంపిపి సమావేశానికి హాజరు కాలేదని తమకూ రోజు కూలి రూ.వంద లోపు వచ్చేలా ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని ఉపాధి హామీ కూలీలు ఫిర్యాదు చేశారు.

గార మండలం అంపోలుకు చెందిన రావాడ ఆదినారాయణ తనకు చెందిన 60 సెంట్ల భూమి నుంచి సుమారు 0.28 సెంట్లు వంశధార కాలువ నిర్మాణానికి తీసుకున్నారని, ఆ స్థలంలో ఉన్న 32 చెట్లకు పరిహారం చెల్లిస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. తక్షణమే పరిహారం ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

సొంతింటిని నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే, రెండు అంతస్తుల భవనం ఉన్నట్లు సచివాలయ ఉద్యోగులు తప్పుగా నమోదు చేశారని, విచారణ చేయించి ఇళ్లు ఇప్పించాలని నరసన్నపేట మండలం తామరాపల్లికి చెందిన భరిణి కోరారు.

తన భూమికి సంబంధించి 1బి, అడంగల్ పేరు తప్పుగా చూపిస్తోందని, రికార్డుల్లో మార్పు చేసి తన పేరున ఇప్పించాలని ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన బుగత శంకరమ్మ వినతిపత్రం అందజేశారు.

శ్రీకాకుళం రూరల్ మండలం గనగళ్లవానిపేట వద్ద నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో పెద్దఎత్తున కోతకు గురవుతోందని, దీనివల్ల గ్రామాలకు ముప్పు పొంచి ఉందని గణగళ్ల మహేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జీడి పరిశ్రమలను తెరిపించాలి

జీడి పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే జీడి పరిశ్రమలను తెరిపించాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి ఆనందరావు, శిష్టు గోపి వినతిపత్రం అందజేశారు. పలాస మున్సిపాల్టీలో సుమారు 150 జీడి పరిశ్రమలు ఉన్నాయని, సుమారు 20 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీడి కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వారం రోజులుగా పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో జి.బాలయ్య, బి.సింహాచలం, చొక్కర ఈశ్వరరావు, కె.దేవరాజు, మార్పు చిన్న ఉన్నారు. వీటితోపాటు పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై వినతులు వచ్చాయి.

పెండింగ్ వినతులను పరిష్కరించాలి

స్పందన, ఎపి సేవ, మీసేవ, జగనన్న చెబుదాం, జగనన్న సురక్షలో నమోదవుతున్న ఫిర్యాదులపై సకాలంలో స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE-CUM-PROHIBITION & EXCISE COURT AT SRIKAKULAM
O.S.NO. 48 OF 2022

Between:
State Bank of India, Gara rep., by its Branch Manager Gara, Srikakulam District. --Plaintiff
And:
Pedireddla Ravi Krishna --Defendant

SUMMON

To,
Pediredla Ravi Krishna S/o late Simhachalam, Working as Junior Assistant & Personal Secretary to MP Srikakulam, DPO Office, Srikakulam R/at MIG 2/14, APHB Colony, Opp: ZP, Srikakulam Town, Srikakulam Municipal Corporation & District.
Please take notice that the above suit is filed for recovery of loan amount due from you and the suit stands posted to **05-09-2023** for your appearance either in person or through an Advocate **at 10.30AM.,** Failing which the matter will be heard and decided ex- parte in your absence by the Honourable Court.

// BY ORDER OF THE HONOURABLE COURT //

P.V.NARASIMHULU
Advocate,
Srikakulam,
Cell: 9963230649.

Srikakulam,
Dt.10-07-2023

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
E.P 43/2020 IN 5/2018

Between:
Teki Domamma --Petitioner(DHr)
And;-
Damarasigu Srinu --Respondent (jdr)

ORDER 21RULE 54 NOTICE

To,
Damarasjngu Srinu S/o late apparao, Resident of Door No.2/13/20,Rella veedhi, Illisipuram, Srikakulam TOwn and District

పై నెంబరు అమలు షెడ్యూలు దాఖల ఆస్తిని జప్తు చేయమని కోరుతూ పై నెంబర్ పిటీషనరు పిటిషన్ కు దాఖలు చేయు చున్నందున సదరు విషయమై మీకు గల అక్షేపణలు పై కోర్టు వారి ఎదుట **తేదీ 11-08-2023 దిన ఉదయం 10:30 గంటలకు** కుద్దున గాని, వకీలు మూలంగా గాని తెలియ పరచవలెను లేని యెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది

బలగ గణపతి పట్నాయక్
న్యాయవాది,
శ్రీకాకుళం,
Cell No.9492762514.

సిసి రెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగిగా ప్రతిఒక్కరికీ జవాబుదారీగా ఉంటూ ఓర్పు, సహనంతో సమాధాన పరచగల నేర్పు అలవర్చుకుంటే ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడుతుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. 12 ఏళ్ల పాటు ఎంతో సమర్థవంతంగా తన క్యాంపు క్లర్క్ స్థానంలో పనిచేసి ఉద్యోగోన్నతిపై విజయవాడ వెళ్తున్న కామేశ్వరరెడ్డిని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సన్మానించారు. తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందిన కామేశ్వరరెడ్డి రాజధానిలో పర్యాటకశాఖలో పనిచేసేందుకు డెప్యుటేషన్‌పై వెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, ఆర్‌డిఒ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి స్పందనకు 57 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోలీస్ స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌శాఖ సిబ్బంది ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 57 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్పందనలో వచ్చిన స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదునూ సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులుకు ఫిర్యాదుల వివరాలను తెలియజేశారు. చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలన్నారు. ఈ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని ఆదేశించారు. మోసపూరితమైన ఆరు, కుటుంబ తగాదాలు ఏడు, పాతవి నాలుగు, ఆస్తి తగాదాలు 16, ఇతరులు 24 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వర్ పాల్గొన్నారు.

13న మత్స్యకార జిల్లా మహాసభ

సోంపేట : మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఏకైక ధ్యేయంతో ఈ నెల 13న శ్రీకాకుళంలో నిర్వహించనున్న మత్స్యకార జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎస్‌టి సాధన సమితి జిల్లా కన్వీనర్ చీకటి శ్రీరాములు పిలుపునిచ్చారు. సోంపేట, కవిటి మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన హక్కుల కోసం అందరం ఉమ్మడిగా కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టి సాధన సమితి నాయకులు సూరాడ చంద్రమోహన్, మైలిపిల్లి నరసింగరావు, మైలపల్లి త్రినాథ్, దుమ్ము అశోక్, వసుపల్లి కృష్ణ, బడే సూర్యనారాయణ, మగుపల్లి పాపారావు, సురాడ భైరాగి, వంక రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాల్లో ప్రజాస్వామ్య తెలుసుకుని వాటి పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని చెల్లాయివలస పరిధిలోని అంబీరుపేట, చింతువానిపేట, కమ్మరిపేట, బెలమరపాలవలస, పిర్యాగ్రహారం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా బెలమర పాలవలసలో రూ.పది లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ఏ ధ్రువపత్రాలు అవసరమైనా కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారని అన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎఎంసి ఛైర్మన్ దుంపల భాస్కరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నందిగా : మండలంలోని నౌగాంలో సర్పంచ్ పుష్ప, సత్యం అధ్యక్షతన నిర్వహించిన జనగన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిడిఒ జి.శివప్రసాద్, తహశీల్దార్ వై.వ.పద్మావతి, ఎంపిటిసి బర్నాన బాలకృష్ణ పాల్గొన్నారు.

రణస్థలం : మండల కేంద్రంలోని జె.ఆర్. పురం పంచాయతీ సచివాలయం -1 పరిధిలోని నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న సురక్ష ద్వారా పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ధర్మపురం సచివాయలంలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిలించిన నూతన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, దున్న గురుమూర్తి, సర్పంచ్‌లు రాజశేఖరరెడ్డి, పిట్ట రుక్మిణి, కారంగి మోహనరావు, పిట్ట ఆనంద్, తహశీల్దార్ గురుప్రసాద్, ఎపిఒ శ్రీనివాస్, మండల ఎఒ శ్రీదేవి పాల్గొన్నారు.

నౌపడ : అర్హులైన ప్రతి పౌరుడికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి అన్నారు. నౌపడ సచివాలయం వద్ద సర్పంచ్ బృందాదేవి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో ఆపల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ కెళ్లి జగన్నాథం, తహశీల్దార్ చలమయ్య, ఎంపిడిఒ ప్రేమలీల పాల్గొన్నారు.

పోలాకి : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

కోటబొమ్మాళి: మండలంలోని జగన్నాథపురం వద్ద సర్పంచ్ నూక శైలజ ఆధ్వర్యాన నిర్వహించిన జనగన్న సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు పాల్గొన్నారు. అనంతరం ఫ్యామిలీ, కుల ద్రువీకరఫత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సింగూరు కళ్యాణి, ఉప సర్పంచ్ అన్నెపు భాస్కరరావు, హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, గుంట సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని చీమలవలస సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయల మండల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల

జీతాల సమస్యను పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్

ప్రజాశక్తి- మందస

ఇటీవల నిర్వహించిన బదిలీల్లో పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ కాలేదన్న నెపంతో జీతాలు చెల్లించకపోవడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు కిషోర్ కుమార్ అన్నారు. మందస ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో యుటిఎఫ్ మందస మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన ఎంపిపి స్కూల్ కొత్తపల్లి ఉపాధ్యాయులు గుంట కృష్ణప్రశాంత సేవలను కొనియాడుతూ నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా తీసుకునే నిర్ణయాల వల్ల అటు విద్యారంగానికి, ఇటు ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలో నూతన విధానాలు ప్రవేశపెడుతున్నట్లు చెబుతున్న ప్రభుత్వం అందుకు తగ్గట్లు ఉపాధ్యాయ నియామకాలు గాని, కొత్త పాఠశాలల ఏర్పాటు చేయలేదని అన్నారు. జిఒ నంబరు 117ను అడ్డుపెట్టి ఉన్న పాఠశాలలను, ఉపాధ్యాయ పోస్టులను కుదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనల పేరుతో ఉపాధ్యాయులను భయాందోళనలకు గురి చేస్తున్నారని అన్నారు.

జగనన్న విద్యా కానుకలో ఇప్పటికీ కొన్ని టైటిల్స్ లేకపోవడం, పిల్లలకు సరిపడే బూట్ల సైజులు లేకపోవడం లాంటి లోటుపాట్లు సరిచేయకుండా పిల్లలు వేసుకోలేదనే నెపంతో ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిని మార్చుకోకపోతే భవిష్యత్‌లో ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. 11 పిఆర్‌సికి సంబంధించిన ఎరియర్స్ సరెండర్ బిల్లులు, డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయమని పోరాటం చేస్తుంటే... ప్రభుత్వం మాత్రం సిపిఎస్‌ను రద్దు చేసి జిపిఎస్ అనే వింత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధం కావడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.పరమేశ్వరరావు, రాక్మి కౌన్సిలర్ జి.కోదండరావు, జిల్లా అకడమిక్ సెల్ కో-కన్వీనర్ జి.రమేష్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.సోమేశ్వరరావు, కె.మాధవరావు, పి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా లక్ష్మీనారాయణ

సోంపేట : స్థానిక న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న బేసి లక్ష్మీనారాయణ గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమితులైన లక్ష్మీనారాయణను బార్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు అభినందనలు తెలియజేశారు.

లక్ష్మీనారాయణ

సన్మానిస్తున్న సింహాచలం

ఎంఇఒలకు సన్మానం

టెక్కలి : మండలంలో నూతనంగా నియమితులైన ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులను ప్రయివేట్ విద్యా సంస్థల ప్రతినిధులు సోమవారం రిసోర్స్ కేంద్రంలో సన్మానించారు. అనంతరం ప్రయివేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వం ద్వారా తమకు రావాల్సిన పుస్తకాల సరఫరాపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంఇఒలు మాట్లాడుతూ విద్యా సంవత్సరం నిర్వహణలో ఎటువంటి నిబంధనలను ఉల్లంగించరాదన్నారు. ప్రతి పాఠశాలకూ ప్రభుత్వం గుర్తింపు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రయివేట్ విద్యా సంస్థల అసోసియేషన్ అధ్యక్షులు నౌపడ సింహాచలం, కార్యదర్శి దువ్వాడ చంద్రమోహన్, బరాటం శ్రీనివాసరావు, మళ్ల మధులత, ప్రమోద్, డి.మల్లేశ్వరరావు, జగదీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం

దుర్వాసనకు ముక్కు మూసుకుని సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రంలోని అనధికార డంపింగ్ యార్డు స్థానిక విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లుపాలు చేస్తోంది. సరుబుజ్జిలి కూడలి నుంచి పాలకొండ వైపు వెళ్లే రోడ్డులో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలో ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేంకటసాయి ప్రయివేటు విద్యాసంస్థలు ఉన్నాయి. రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు ఉదయం, సాయంత్రం సమయంలోనూ ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. అయితే పాలకొండ రోడ్డులో డంపింగ్ యార్డును తలపించేలా చెత్త వేస్తున్నారు. ఎక్కడ శుభ కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు ఈ రహదారిలోనే పారబోస్తున్నారు. స్థానిక వ్యాపారులు, చికెన్ సెంటర్ వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు ఈ దారిలోనే పడేస్తూ అనధికారికంగా డంపింగ్ యార్డుగా మార్చేశారు. దీనివల్ల ఈ ప్రాంతం దుర్గంధం భరితంగా మారిపోయింది. ఇటువైపుగా ప్రయాణం చేస్తున్న వారంతా ముక్కు మూసుకుని నడవాల్సిందే. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని దుర్వాసన నుంచి విముక్తి కలిగించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

గురుకుల అభివృద్ధికి కృషి

నందిగాం : నందిగాంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం గురుకులాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపాల్ బి.దమయంతి ఎమ్మెల్సీకి వివరించారు. జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం, మాజీ ఎంపిపి యర్రా చక్రవర్తి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.ధర్మారావు, టి.తిరుపతిరావు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

'మండే' ఎండ

కోటబొమ్మాళి: ఈ యేడాది గతం కంటే అధికంగా వేసవి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తొలకరిలో వర్షాలు మినహా మళ్లీ చినుకు జాడ లేకపోవడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. జూలైలో అడుగుపెట్టి 10 రోజులు గడుస్తున్నా ఇంతవరకు భానుడి భగభగలు మాత్రం తగ్గలేదు. ఈ ఉష్ణోగ్రతల తీవ్రత ఎంతకాలం ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భానుడి ప్రతాపానికి భయపడి ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. దీంతో ప్రధాన రహదారులు నిర్మాణుషంగా మారాయి. సోమవారం రోజున మండే ఎండలతో రహదారులపై ప్రయాణించే మోటార్ సైకిల్ వాహన దారులు పలు ఇబ్బందులు పడ్డారు. కోటబొమ్మాళి మండలంలో కొత్తపేట, లఖందిడ్డి, సీతన్నపేట, పాకివలస, నిమ్మాడ, కొత్తపల్లి, తిలారు తదితర గ్రామాల్లో రహదారుల బోసిపాయాయి. అధిక ఎండలతో ప్రయాణించే ప్రయాణికులు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎండ వేడికి, ఉక్కపోతకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

శతశాతం హామీల అమలు

శాసనసభ స్పీకర్ సీతారాం

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ఆమదాలవలస: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలస, గాంధీనగర్, కంద్రవీధి, కుప్పిలివారి వీధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది? లేనిది? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ కలల కన్నా గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, బొడ్డేపల్లి అజంత కుమారి, బొడ్డేపల్లి రవి, సంపదరావు, రామారావు, మామిడి రమేష్, సాధు చిరంజీవి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు

మూలపేట నిర్వాసితులకు న్యాయం చేయాలి

'సజ్జల'ను కోరిన సర్పంచ్ బాబూరావు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని సర్పంచ్ జీరు బాబూరావు కోరారు. ఈ మేరకు విజయవాడలోని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో తమ బతుకులు బాగుపడతాయని, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సర్వస్వం త్యాగం చేసి నిర్వాసితులుగా మిగిలిపోయామని చెప్పారు. అయితే గ్రామంలో ఇప్పటికీ పలువురుకు పిడిఎఫ్ ప్యాకేజీలు అందలేదని దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా ఉన్న నిర్వాసితులకు పోర్టులో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. పోర్టులో కాంట్రాక్టు పనులు తమకు ఇవ్వడం లేదని వాపోయారు.

'దువ్వాడ' నమ్మించి గొంతు కోస్తున్నారు

మూలపేట పోర్టుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి శరవేగంగా పనులు చేపడుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా పెత్తందారుల తమ హవా ప్రదర్శిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన ఆయన సోదరులు అనుచరుల పెత్తనం ఏంటని ప్రశ్నిస్తూ వినతిపత్రంలో పేర్కొన్నారు. తమకు రావాల్సిన ఉపాధి అవకాశాలకు, కాంట్రాక్టులకు వీరు చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఊరిని, భూములను, ఇళ్లను త్యాగం చేసి నిర్వాసితులుగా మిగిలితే... తమపైన ఎవరో పెత్తనం చేయడం ఏం న్యాయమని ప్రశ్నించారు. సత్వరమే పెత్తందారుల నుంచి విముక్తి కలిగించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పిడిఎఫ్ పరిహారం అందజేయాలని కోరారు. ఇచ్చినహామీ మేరకు నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆయనతోపాటు జీరు రాంబాబు ఉన్నారు.

ఎఫ్‌పిఒ సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి- కవిటి

చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధే ధ్యేయంగా, వ్యవసాయ రంగ పురోభివృద్ధికి స్థానిక ఎఫ్‌పిఒ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక ఎఫ్‌పిఒ ఆధ్వర్యాన వాసన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సబ్సిడీపై వచ్చిన కొబ్బరి మొక్కలను మండలంలోని బొరివంక, కవిటి, ముత్యాలపపేట, భైరిపురం, చండిపుట్టుగ, రాజపురం గ్రామాల్లో రైతులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌పిఒలు రైతులకు ఆర్థికంగా సహాయం అందించడమే కాకుండా వారికి మేలైన వంగడాలు సబ్సిడీపై అందించడం శుభపరిణామమని అన్నారు. ఎపిఎం గోవింద్ మాట్లాడుతూ వాసన్ స్వచ్ఛంద సంస్థ అందించిన రూ.6 లక్షల ఆర్థిక సాయంతో సుమారు 600 మంది రైతులకు నామమాత్ర ధరకు 22 వేల కొబ్బరి మొక్కలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాలం శ్రీరాంప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.శంకరరావు, ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, వాసన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు అందిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

క్యాప్కో రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా రామ్మోహనరావు

శ్రీకాకుళం అర్బన్ : వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా నగరానికి చెందిన న్యాయవాది బగాది రామ్మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ వాడలోని స్వాతంత్ర సమరయోధుల భవనంలో సోమవారం నిర్వహించిన క్యాప్కో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్య సంఘాలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో క్యాప్కోకు ఆయన రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. జిల్లాలో వినియోగదారుల హక్కుల కోసం నిరంతరాయంగా పోరాడుతున్నారు. ఆయన ఎన్నికపై జిల్లా వినియోగదారుల సంఘంతో పాటు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నిక అనంతరం ఆయన విజయవాడలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామ్మోహనరావు

నేత్ర వైద్య శిబిరాలకు స్పందన

పలాస : మండలంలోని టెక్కలిపట్నంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు, జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో కైలాసవాసా ఛారిటబుల్ ట్రస్టు పాలవలస రామకృష్ణారావు (శర్మ) శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 89 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అందులో 45 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తమాలిక్ ఆఫీసర్ కూన అరుణకుమారి, క్యాంపు ఇన్‌ఛార్జి తెంబ రామారావు, క్యాంపు కో-ఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు పట్టణంలోని సత్యసాయి ఆలయం వద్ద డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.రత్నంరాజు పరిసర గ్రామాలకు చెందిన 137 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 65 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రాధాకృష్ణ, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ ఎస్.అప్పలరాజు, కో-ఆర్డినేటర్ ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీనివాసరావుకు ప్రశంసలు

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, సీడ్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రశంసలు లభించింది. నాగార్జున యూనివర్సిటీ స్పందన, ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు చేస్తున్న సామాజిక సేవలను గుర్తిస్తూ ప్రశంసాపత్రాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ ఇదా శ్యాముల్‌రెడ్డి, సైక్రియాట్రిస్టు రాజేశ్వరరావు, ఎస్ఇఐఎఫ్ ప్రతినిధులు అందజేశారు.

డిగ్రీ విద్యార్థులకు బొటానికల్ సర్వే

ఇచ్ఛాపురం : స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి ఆధ్వర్యాన ప్రథమ సంవత్సరం సిబిజెడ్ విద్యార్థులతో సోమవారం బొటానికల్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో బొటనీ లెక్చరర్ టి.బృందావన్, వృక్ష వైద్యం, ఔషధ మొక్కల ఉపయోగాల గురించి వివరించారు. రసాయన పదార్థాల వాడకం వల్ల మన నిత్యజీవితంలో ఉపయోగించే ఔషధ మొక్కలు అంతరించిపోతున్నాయని అన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

అవగాహన కల్పిస్తున్న లెక్చరర్ బృందావన్

మంత్రి అప్పలరాజుపై విమర్శలు తగవు

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి రాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గం అభివృద్ధితో పాటు మత్స్యకారుల అభ్యున్నతికి పాటుపడుతున్న మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులపై టిడిపి నాయకులు చేస్తున్న విమర్శలు తగవని వైస్ ఎంపిపి వంక రాజు, మంచినీళ్లపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు వంక లక్ష్మయ్యలు మండిపడ్డారు. మంచినీళ్లపేటలో గ్రామస్తులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సర్పంచ్ అభ్యర్థి ధర్నాలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వచ్చిందని పోలీసులు కేసు నమోదు చేస్తే మంత్రిని బాధ్యులని ఆరోపించడం సమంజసం కాదన్నారు. చోడిపిల్లి ఏసులు ఇంటిపై అన్నదమ్ములతో కలిసి దాడి ఘటనలో కేసు నమోదైందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు రాకుండా చేయడానికి కుట్రతో అక్రమ కేసులు పెట్టింది చిన్నారావు అని అన్నారు. వేటకు వెళ్లిన మత్స్యకారుడు బుంగ రాజు మృతి చెందితే రూ.ఐదు లక్షలు నష్టపరిహారం మంత్రి చొరవతో అందిందని అన్నారు. సమావేశంలో సాగర మత్స్యకార సొసైటీ ఉపాధ్యక్షుడు గోసాల సాంబమూర్తి, పిల్లాలు చోడిపిల్లి జంగమయ్య, బుంగ శంకరరావు, కొమర మోహనరావు పాల్గొన్నారు.

వాలంటీర్ల ఆందోళన

ప్రజాశక్తి- పలాస

వాలంటీర్లు దేశవిద్రోహ శక్తులుగా వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని మందస మండలానికి చెందిన ప్రదీప్, బాలకృష్ణ, మున్సిపాలిటీకి చెందిన సునీత, కిరణ్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీజీ విగ్రహం వద్ద పవన్ వ్యాఖ్యలపై సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. మహిళలపై మీకు ఎంత గౌరవం ఉందో ఇప్పుడే అర్థమవుతుందన్నారు. మీరు చెప్పిన డేటా ఎవరికి అందిందో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగంగా మాట్లాడిన మాటలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకుంటే యావత్ మహిళా లోకం సరైన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు వాలంటీర్లు సమాచారం ఇస్తున్నారన్న పవన్ తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పేదల కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్నామని అన్నారు. ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ హుందాగా ప్రవర్తిస్తే బాగుంటుందని అన్నారు. మహిళలను, వ్యవస్థలను గౌరవించని వారు రాజకీయాల్లో కొనసాగేందుకు అర్హత లేదన్నారు.

టెక్కలి రూరల్ : వాలంటీర్ల జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు హేయమైనవని టెక్కలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పేర్కొన్నారు. టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద సోమవారం మానవహారం చేపట్టి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆమె మాట్లాడుతూ వాలంటీర్లుగా స్వార్థం లేకుండా పనిచేస్తున్న విషయం పవన్‌కళ్యాణ్‌కు తెలియకపోవడం శోచనీయమన్నారు. మరోమారు వాలంటీర్లపై కారుకూతలు కూస్తే గట్టిగా బుద్ధి చెప్పాలి వస్తుందని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్ బేషరతుగా వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మానవహారం నిర్వహిస్తున్న వాలంటీర్లు

మహిళలతో మాట్లాడుతున్న ఛైర్మన్ గిరిబాబు

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్నామని బత్తులవీధి, రాజమ్మ కాలనీకి చెందిన మహిళలు వాపోయారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించాలని పదేపదే మున్సిపల్ పాలకవర్గం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, వార్డుల్లోని బోర్లు మరమ్మతులకు గురికావడంతో నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నామని వాపోయారు. బావులు ఎండిపోయాయని, పవర్ బోర్ సక్రమంగా పని చేయడం లేదని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలాస మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డిఇఇ బల్ల హరి మాట్లాడుతూ తాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాడైన బోర్లకు తక్షణమే మరమ్మతులు చేపడతామని చెప్పారు. రాజమ్మ కాలనీకు మూడు తాగునీటి ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు. అక్కడక్కడే మున్సిపల్ అధికారులను ఆదేశించి ఆయా ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు.

ఎన్‌టిఆర్ కాలనీలో తాగునీటి కష్టాలు

టెక్కలి రూరల్ : టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలనీలోని పలు విధులకు తాగునీటి కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారు. ఎన్‌టిఆర్ కాలనీ 14వ లైన్ ప్రజలు తమకు కుళాయిలు ద్వారా తాగునీరు అందించడంలేదని సోమవారం నిరసన తెలిపారు. మిగిలిన వీధులకూ పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా కావడం లేదని స్థానికులు వాపోయారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న రామారావు

రోటరీ సేవలు విస్తృతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.రామారావు అన్నారు. నగరంలోని నాగావళి హోటల్‌లో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్‌శ్రీశీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. నూతన ప్రెసిడెంట్‌గా వై.మురళీమోహనరావు, సెక్రటరీగా కె.ఎన్.వి.దుర్గారావు, పాస్టు ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కోరాడ హరగోపాల్, జాయింట్ సెక్రటరీ ఎన్.శరత్ కుమార్, కోశాధికారి కె.వి.కామేశ్వరరావు, ఎన్.వి.భాస్కరరావుతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నటుకులు మోహన్, ఊన్న సర్వేశ్వరరావు , పాలిశెట్టి మల్లిబాబు పాల్గొన్నారు.

సోంపేట: రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని నూతనంగా నియమితులైన అధ్యక్ష, కార్యదర్శులు దుద్ది శ్రీనివాసరావు, పి.కృపారావు తెలిపారు. పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని రోటరీ గవర్నర్ ఆర్ సుబ్బారావు చేయించారు.

దీక్ష చేస్తున్న సొండిలు

'సొండి'ల నిరాహార దీక్ష

ప్రజాశక్తి- కంచిలి

20 ఏళ్ల క్రితం సొడిలకు సామాజిక భవన నిర్మాణానికి దాతలు స్థలం ఇచ్చారని, కొంతమంది ఫిర్యాదులు చేస్తూ ఆటంకాలు కల్పిస్తున్నారని ఎం.ఎస్.పల్లి సొండిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎం.ఎస్.పల్లి సచివాలయం వద్ద సోమవారం సొండిలు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘ భవనం సంబంధించిన స్థలం ఎటువంటి వివాదానికి తావులేనిదని అన్నారు. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు సైతం మంజూరు చేసిందని, దీంతో నిర్మాణాలు చేపట్టామని అన్నారు. ఇటువంటి స్థలంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని అన్నారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ హైమావతి, ఎంపిడిఒ చల్ల శ్రీనివాసరెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి వారితో మాట్లాడారు. వారు ఇచ్చిన పత్రాలను పరిశీలించి సంఘ భవనం ఉన్న స్థలం వివాద రహితమైనదని గుర్తిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. ఈ దీక్షలో సొండిల సంక్షేమ సంఘం నాయకులు ఎన్.భాస్కరరావు, లక్ష్మీనారాయణ, ఎన్.లోకనాథం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న వైద్యులు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు సాహితీ, ప్రియదర్శిని అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐవి ఫ్లూయిడ్ ద్వారా రక్తాన్ని ఎక్కించి నెల రోజులకు సరిపడా మందులను పంపిణీ చేశారు. అనంతరం మెట్టక్కివలస భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన గర్భిణులకు, రోగులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కామవధానులు, వైద్యులు డాక్టర్ పి.తాతయ్యలు, వృద్ధాశ్రమం ఇన్‌ఛార్జి ప్రహ్లాదరావు, మహిళా కో-ఆర్డినేటర్ రామలక్ష్మి, ఫార్మసిస్టు చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, స్టాఫ్‌నర్స్ జ్యోతి, డేటా ఆపరేటర్ హేమంత్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా పంపిణీ

ఇచ్ఛాపురం : పట్టణంలోని 11 వార్డు కస్పాగౌడ వీధిలో కిశోర్ చంద్ర బెహరా ఇటీవల మృతి చెందారు. ఈయన వైఎస్‌ఆర్ బీమాలో చేరాడు. దీంతో మృతి నామినీకి వార్డు కౌన్సిలర్ ఆసీ లీలారాణి, మెప్మా మేనేజర్ నక్క జానకిరామారావు రూ.పది వేలు నగదు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్టేటివ్ సెక్రటరీ షేక్ జీనత్, వెల్ఫేర్ సెక్రటరీ బట్టి బాలకృష్ణ పాల్గొన్నారు.

బలసలరేవు వంతెన వరకు రోడ్డు వేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

బలసలరేవు వంతెన వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని మండలంలోని బెలమాం, గంగ్రేడు, లొద్దలపేట గ్రామస్తులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. మండలంలోని బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో రూ.85 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిను స్పీకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బెలమాం గ్రామస్తులు మాట్లాడుతూ పొందూరు మండలం గంగ్రేడు నుంచి నాగావళి నది ఒడ్డును అనుసరించి నేరుగా బలసలరేవు వంతెన వరకు రహదారి నిర్మాణాన్ని విన్నవించారు. ఆమదాలవలస మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఈ లింకు రోడ్డు నిర్మాణం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే ఇటు శ్రీకాకుళం మీదుగా గాని, ఆటో లచ్చయ్యపేట, కావలి, వాల్తేరు మీదుగా చేరుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల దూరం, విలువైన సమయం వృథా అవుతుందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎటువంటి ల్యాండ్

స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎక్విజేషన్ అవసరం లేకుండానే నిర్మాణాన్ని పూర్తి చేయవచ్చని తెలిపారు. స్పీకర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో సిసి రోడ్లు వేసి ఏళ్లు గడిచిపోయాయని, అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు.

అలాగే శివాలయం దగ్గర ఉన్న ర్యాంపు శిథిలావస్థకు చేరుకోవడంతో నదికి వెళ్లడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అన్నారు. దొర చెరువు పూను శిథిలమైందన్నారు. దీంతో సాగునీటి కోసం కోసం పూను వేసినా నీరు రావడం లేదని రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బెలమాం సర్పంచ్ కనుగుల కిషోర్, వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు బెండి గాంధీ, పంచాది పాపారావు, తమ్మినేని గురునాథరావు, పూజారి సూర్యం, పైడి యోగేశ్వరరావు, పూజారి హరిప్రసన్న, పృథ్వీరాజ్ పాల్గొన్నారు. నారాయణపురం కుడి కాలువ సబ్ ఛానల్ అయిన కొత్తబట్టి ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని బెలమాం, లొద్దలపేట, తాడివలస, లచ్చయ్యపేట, గంగ్రేడు, వెంకమ్మపేట కోరారు. నారాయణపురం కుడి కాలువ ఆధునికీకరణ పనులు కారణంగా రెండేళ్లుగా ఈ ప్రాంత రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని వివరించారు.

వంతెనను నిర్మించాలి

సరుబుజ్జిలి : వంశధార నాగావళి అనుసంధాన కాలువపై బ్రిడ్జిని నిర్మించాలని టిడిపి ఎస్‌సి, ఎస్‌టి నియోజకవర్గ కన్వీనర్ గుగ్రాల చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని అమృత లింగానగరం గ్రామ సమీపానికి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన గిరిజనులు సోమవారం చేరుకొని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన చేపట్టారు. ఎల్ఎన్‌పేట జంబాడ, మురగడ, భూచంద్రి, కడగండి, గ్రామాలకు చెందిన సుమారు 40 మంది గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అనుసంధాన కాలువ పనులు పూర్తయితే తమ పంట పొలాలకు, గ్రామాలకు రహదారి లేక తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, అధికారులు ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించి అనుసంధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. టిడిపి పార్లమెంటరీ ఎస్‌సి సెల్ కార్యదర్శి సవాళాపురపు రాజారావు, గిరిజనులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై విస్తృత ప్రచారం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) సేవలను ప్రభుత్వమే నేరుగా అందిస్తుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో చైల్డ్ హెల్ప్‌లైన్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, బాలల రక్షణకు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు చైల్డ్ లైన్ (1098) సేవలను కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ నుంచి శతశాతం నిధుల మంజూరు ద్వారా దేశంలో చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా నిర్వహించేదని చెప్పారు. జిల్లాల్లో స్థానిక స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పనిచేసేవని భాగస్వామ్యంతో పనిచేసేవన్నారు. ఇప్పుడే నేరుగా ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ హెల్ప్‌లైన్ 18 ఏళ్ల లోపు బాల బాలికలకు నిరంతరం అందుబాటులో ఉండి, అత్యవసర సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ఇఆర్ఎస్ఎస్-112తో సమన్వయం చేసుకుని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ మురళీకృష్ణ, ఐసిడిఎస్ పీడీ జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే చిత్రంగా 'భోళాశంకర్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిరంజీవి నటన, డాన్సులతో ప్రజారంజకంగా బోళాశంకర్ చిత్రం నిర్మిస్తున్నారని, ఈ చిత్రం ప్రజలు మెచ్చే చిత్రంగా రూపొందించామని ఆ చిత్ర దర్శకులు మెహర్ రమేష్ చెప్పారు. కుటుంబ సభ్యులు, కథా రచయిత మామిడాల తిరుపతితో కలిసి ఆయన అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆయనకు చిరంజీవి అభిమాన సంఘం నాయకులు త్రైక్వాండో శ్రీను, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. నటనలో చిరంజీవికి ప్రజాభిమానం చెక్కు చెదర లేదని అన్నారు. ఈ ఆదరణకు తగ్గట్టుగానే మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. చిరంజీవి నటించిన భోళాశంకర్ చిత్రాన్ని ఆగస్టు 11న విడుదలకు సిద్ధం చేశామని అన్నారు. ఈ చిత్రం విజయవంతమైన తర్వాత మరోసారి అరసవల్లి సందర్శిస్తానని చెప్పారు. శ్రీకాకుళంలో సందర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయని, రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో చిత్ర నిర్మాణానికి అనువైన పరిస్థితులను పరిశీలిస్తామని అన్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ అభ్యర్థన మేరకు అరసవల్లి దేవస్థానంపై కూడా డాక్యుమెంటరీ తీసేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, వైశ్యరాజు మోహన్, బలభద్రుని రాజా, ఉత్తరాంధ్ర డిస్ట్రిబ్యూటర్ సతీష్, సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్న రాజు, చిరంజీవి అభిమానులు గౌతమ్, నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందుకుంటున్న చిత్ర దర్శకులు మెహర్ రమేష్

చోటాకె.నాయుడు సందర్శన

తెలుగు చలన చిత్ర రంగంలో సినిమా ఫొటోగ్రాఫర్‌గా ఉన్న చోటా కె.నాయుడు అరసవల్లి శ్రీసూర్య నారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఫొటో ఎక్స్‌ఫో కార్యక్రమానికి హాజరై అరసవల్లిని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆయనతో పాటు పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

మెటీరియల్‌ని అందిస్తున్న ఆనందరావు

మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో ఇంగ్లీస్ ఉపాధ్యాయునిగా విదులు నిర్వర్తిస్తున్న తమ్మినేని ఆనందరావు తన ఔధార్యాన్ని చాటుకున్నారు. బాలికోన్నత పాఠశాలల్లో ఈ ఏడాది నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ చదువుతున్న 45 మంది విద్యార్థులకు రూ.పది వేలు విలువైన ఇంగ్లీష్ మెటీరియల్‌ని సోమవారం అందించారు. ఈ మెటీరియల్ ద్వారా ఆంగ్లంలో అవగాహనకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఔధార్యంపై ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

70 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన మండలంలోని నీలంపేటలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 104 వాహనం ద్వారా వైద్యాధికారి జి.రాజశేఖర్ నేతృత్వంలో 70 మంది రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎస్.సుప్రియ, ఎఎన్ఎం కె.గౌరి, సతీష్‌నాయుడు, సూపర్‌వైజర్ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

వరి గట్లపై కూరగాయల సాగు

పొలం గట్లను చదును చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి గట్లపై కూరగాయల సాగుతో ఆదనపు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపేన సురేష్, నక్క చిరంజీవిలు అన్నారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లవాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులు వరి సాగు చేసే పొలాల గట్లను వెడల్పు చేసి బాగు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రధానంగా ఖరీఫ్ పంట కాలంలో వరిపొలం చుట్టూ ఉన్న గట్లను మూడు అడుగులు వెడల్పు ఉండేలా చదును చేసుకోవాలన్నారు. వాటిపై ప్రధానంగా పలు రకాల కూరగాయ విత్తనాలు వంగ, బెండ, చిక్కుడు, టమాటా గోరుచిక్కుడు నాటుకోవాలని సూచించారు. మధ్య మధ్యలో అరటి, కొబ్బరి, మునగ ఈ విధంగా పలు రకాల విత్తనాలు వేసుకొని సాగుచేయడం వల్ల రైతుకు వరి పంటతో పాటుగా అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. గట్లపై ముఖ్యంగా పంటకు రక్షణగా కంది, బంతి మొక్కలను వేసుకుంటే శత్రు పురుగులు బారి నుంచి ప్రధాన పంటను రక్షించుకోవచ్చని అన్నారు. ఈ విధంగా వరి పంట గట్లపై ఖాళీ ఉండకుండా పలు రకాల కూరగాయ, మొక్కలు వేసుకొని సాగు చేయాల న్నారు. రైతులకు తమ ఇంటి అవసరాల నిమిత్తం స్వచ్ఛమైన ప్రకృతి సేద్య కూరగాయలు, పంట కాలంలో అదనంగా కొంత ఆదాయం కూడా వస్తుందని అన్నారు.

గౌతు శిరీష పరామర్శ

పలాస : మండలంలోని జయరామచంద్రపురానికి చెందిన టిడిపి నాయకులు కిక్కర బాలకృష్ణ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతురాలి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను బాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు లొడగల కామేశ్వరరావు, సవర రాంబాబు, పి.విఠల్, మల్లా శ్రీనివాసరావు డొక్కరి అప్పారావు, మురళి, తమ్మయ్య, గణపతి, చిన్నారావులు ఉన్నారు.

రామ్‌మనోహర్‌నాయుడు...

గార : మండలంలోని బందరువానిపేటలో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లి బోటు బోల్తా పడడంతో గల్లంతైన బాధిత మత్స్యకారుల కుటుంబాలను వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పరామర్శించారు. గ్రామానికి చేరుకున్న తీరంలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మయ్యతో పాటు గల్లంతైన గణపతి కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈయనతో పాటు గనగళ్ల రామారావు, బుద్ధ ఎర్రన్న, మార్పు పృథ్వీ ఉన్నారు.

పలాస : పరామర్శిస్తున్న గౌతు శిరీష

ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

తయారీ యూనిట్‌దారులకు రుణాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాల్లో పంచసూత్రాలు పాటిస్తూ ఏ-గ్రేడ్‌లో ఉన్న సంఘ సభ్యులకు మార్కెట్లో డిమాండ్ ఉన్న ఏ వస్తువు తయారీ యూనిట్ పెట్టుకున్నా 35 శాతం బ్యాంకు సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని అక్కులపేటలో గ్రామ దేవత అమ్మవారి మండపం వద్ద మండల సమాఖ్య కార్యదర్శి బొడ్డేపల్లి వేణమ్మ ఆధ్వర్యాన క్లస్టర్ స్థాయి సిబ్బందితో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంఎఫ్ఎంఇ పిఎంఇజిపి ద్వారా బ్యాంకు కన్సెంట్‌తో గ్రేడింగ్ చేయనున్నట్లు వివరించారు. స్వయం శక్తి సంఘంతో పాటు గ్రామ సంఘం ఆమోదిస్తే ఈ మహిళా ఎంటర్ప్రైజర్‌కు రూ.2 నుంచి రూ.20 లక్షల వరకు యూనిట్ డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఆధారంగా రుణం మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, అక్కులపేట బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రత్యూష, విఒఎలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్వయంశక్తి సంఘాలు శతశాతం గ్రేడింగ్‌కు కృషి చేయాలని వెలుగు ఎపిఎం ప్రసాద్ అన్నారు. స్వయం శక్తి సంఘాలతో సమీక్షించారు. అన్ని రకాల లావాదేవీలు ఆన్‌లైన్ మొబైల్ బుకింగ్ ద్వారా అప్‌డేట్ చేయాలన్నారు. ఏడు గ్రామ సంఘాల్లో స్త్రీనిధి రికవరీ తక్కువగా ఉందని, దీనిని నూరు శాతం పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిసి రామకృష్ణ, విఎలు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న వెంకటరమణ

బాణాపురంలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మాజీ సిఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో భవిష్యత్‌కు గ్యారంటీ అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటమరణ అన్నారు. మండలంలోని బాణాపురం పంచాయతీలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. టిడిపి ఇటీవల విడుదల చేసిన మినీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, ఎంపిటిసి ప్రతినిధి కదంబల రాజు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, బమ్మిడి భాస్కరరావు, హనుమంతు చంద్రశేఖర్, జర్నీ రామకృష్ణ, కృష్ణ, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

భూ సర్వేను ప్రారంభిస్తున్న సత్యప్రసాద్

గోకర్ణపల్లిలో భూ సర్వే

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లిలో వైఎస్‌ఆర్ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ కెమెరాతో పలు భూములను సర్వే చేశారు. ఈ అవకాశాన్ని గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ లోకేష్, సర్వేయర్ విజయ్‌కుమార్, కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.

భోజనం అందిస్తున్న నాయకులు

'అన్నా క్యాంటీన్'కు ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక టిడిపి కార్యాలయ అవరణలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు మండలంలోని ఎత్తురాళ్లపాడుకు చెందిన టెక్కలి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజర్ కార్యదర్శి కోట సంతోష్‌కుమార్ 50 స్టీల్ ప్లేట్లను సోమవారం నిర్వాహకులను అందజేశారు. అన్నా క్యాంటీన్ ద్వారా వందల మంది పేదలకు రూ.5లకే రుచికరమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. అలాంటి అన్నా క్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, కోరాడ గోవిందరావు, లాడి శ్రీను, మక్క లక్ష్మణరావు పాల్గొన్నారు.

యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యువకుడు నిరసన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పాతబస్టాండ్ వద్ద ఉన్న తన దుకాణాన్ని ఖాళీ చేయించి తన జీవనోపాధిని దెబ్బతీశారని బాధిత యువకుడు పేకల కృష్ణారావు వాపోయారు. ఈ మేరకు టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం నిరసన వ్యక్తం చేస్తూ... సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొద్ది సంవత్సరాల క్రితం ఆక్రమణల పేరుతో తన బడ్డీని తొలగించారని, తమ న్యాయం చేయాలని పలుమార్లు విన్నవించుకున్నా... అధికారులు చొరవ చూపడం లేదని వాపోయారు. ఒకానొక దశలో బాధితుడు నిరసన తీవ్రస్థాయి చేరడంతో టెక్కలి రెండో ఎస్ఐ రమేష్ తన బృందంతో వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడు ఆందోళనపై సబ్‌కలెక్టర్ వివరాలు సేకరించారు.

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రమణ

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ పారిశుద్ధ్యం మెరుగు పరిచే విధంగా కృషి చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సమీక్షించారు. పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులతో పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు, కార్యదర్శి బొడ్డేపల్లి రామారావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పలాస : మండలంలోని కేశుపురానికి చెందిన వెంకట్ పాత్రో అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ సంస్థ పలువురు దాతల నుంచి చందాలు వసూలు చేస్తూ రూ. 20 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.జె.ఈశ్వరరావు, పాపారావు, దిలీప్, సూర్యనారాయణ, శ్యామ్, హరికృష్ణ, వేణు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఈశ్వరరావు